క్లుప్తంగా

బీఎల్ఓలకు కిట్ల పంపిణీ



ధరూరు: ఓటరు నమోదుకు సంబంధించిన కిట్లను శనివారం తహసీల్దార్ వహీదా ఖాతున్ బీఎల్ఓలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ర్యాలంపాడులోని 67, 68వ బూత్‌ల బీఎల్ఓలకు కిట్లను అందజేసినట్లు తెలిపారు. ఓటరు నమోదు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ చిట్టెం వెంకట్రామిరెడ్డి, ఆర్.లతీఫ్, సీనియర్ అసిస్టెంట్ నాగేష్, బీఎల్ఓలు చంద్రాబాయ్, నాగమణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల వివరాలివ్వండి

ధరూరు: మండలంలోని మన్నాపురంలో 2014నుంచి 2023 వరకు చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు ఇవ్వాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి మండల నాయకులు శనివారం పంచాయతీ కార్యదర్శి ప్రదీప్‌కు వినతి పత్రం అందజేశారు. ఇప్పటివరకు చేపట్టిన సీసీరోడ్లు, డ్రైయినేజీలు, ఇంకుడుగుంతలు ఇతర పనులకు ఖర్చు చేసిన నిధుల వివరాలను తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో రాముడు, స్వామి, దారెప్ప పాల్గొన్నారు.

ఆంగ్లభాషలో రాణించాలి

శాంతినగర్: ఆధునిక సమాజంలో ఆంగ్లభాషలో రాణించాల్సిన అవసరం ఉందని ఎంఈఓ నర్సింహ అన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీలోని శాంతినగర్‌లో శనివారం మహాబోధి ఇంగ్లిష్ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఇంగ్లిష్ అత్యధిక ప్రాముఖ్యత సంతరించుకుందన్నారు. ప్రతి ఒక్కరూ ఇంగ్లిష్‌లో మాట్లాడటం నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ధర్మచక్ర బండారి, లక్ష్మణ్, నరేష్, భాస్కర్, మహేష్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కేటీదొడ్డి: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం పట్టుకున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. అయిజ మండలం కొత్తపల్లి నుంచి మల్లాపురం గ్రామానికి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్ల యజమానులు జాన్, రాజేష్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నిక

గట్టు: ఎమ్మార్పీఎస్ మండల కమిటీని శనివారం మండల కేంద్రంలో జిల్లా కోకన్వీనర్ బండారి డేవిడ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏసన్న, ఉపాధ్యక్షులుగా నాగరాజు, జేమ్స్, ఆగస్టీన్, అధికార ప్రతినిధులుగా మహేష్, భీమన్న, కార్యదర్శిగా యాదగిరి, సలహాదారుగా నర్సింహులును ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శంకర్, విజయ్, రాజేష్ పాల్గొన్నారు.

అదుపుతప్పిన లారీ




మానవపాడు: లారీ అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లిన ఘటన మానవపాడు స్టేజీ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌వైపు నుంచి కర్నూల్‌కు వెళ్తున్న లారీ జాతీయ రహదారి మానవపాడు స్టేజీ సమీపంలో అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రాము తెలిపారు.

ఉత్సాహంగా ఖోఖో పోటీలు

అయిజ: మండలంలోని ఉత్తనూరు ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి ఖోఖో పోటీలు నిర్వహించారు. అండర్–14, 17 విభాగాల్లో బాలబాలికలకు నిర్వహించిన పోటీల్లో పలు పాఠశాలలకు చెందిన క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జితేందర్, డీవైఎస్ఓ ఆనంద్, జీహెచ్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, హెచ్‌ఎం తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ



ధరూరు: జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో మండల క్రీడాకారులు సత్తా చాటారు. అయిజ మండలం ఉత్తనూరులో నిర్వహించిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ ఖోఖో పోటీల్లో 12 మండలాల క్రీడాకారులు పాల్గొనగా.. అండర్–17 బాలికల విభాగంలో ద్వితీయ బహుమతిని ధరూరు మండల క్రీడాకారులు కైవసం చేసుకున్నట్లు జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి, పీడీ శ్రీనివాసులు తెలిపారు. జిల్లా స్థాయిలో రాణించిన క్రీడాకారులను మండల ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు అభినందించారు.

వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం



జిల్లా కేంద్రంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు



బిజ్వారంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

గద్వాల అర్బన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని డీసీసీ అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అతిఖుర్ రహ్మాన్ అన్నారు. వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల సంక్షేమానికి వైఎస్ రాజశేఖరరెడ్డి అనేక పథకాలను అమలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. వ్యవసాయ సంక్షోభాన్ని తన మార్క్‌తో పారద్రోలి రైతును రాజు చేసిన ఘనత వైఎస్సార్‌కే దక్కిందన్నారు. విద్యార్థుల ఉన్నత చదువులకు ఫీజురియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు అందించి అండగా నిలిచారన్నారు. ఉచిత విద్యుత్, సబ్సిడీ రుణాలు, ఆరోగ్యశ్రీ, రుణమాఫీ ఇతర పథకాలతోపాటు అనేక ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టారన్నారు. తుదిశ్వాస విడిచే వరకు ప్రజాసంక్షేమం కోసం పాటుపడిన మహానేత అని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వీరుబాబు, ఇసాక్, జమాల్, వెంకటేష్, ఇలియాస్, షాషా, కౌసర్ బేగ్, జహంగీర్, పరుశ, వైఎస్సార్‌టీపీ నాయకులు యూనుస్, రాజు, షఫీ, వెంకటేష్, అంజి పాల్గొన్నారు.

మల్దకల్: మండల కేంద్రంతోపాటు బిజ్వారంలో వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతుల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసిన మహనీయుడు వైఎస్సార్ అని కొనియాడారు. కార్యక్రమంలో బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతయ్య, శ్రీనాథ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గోవిందు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైఎస్ రాజశేఖరరెడ్డికి నివాళి అర్పించారు. ఎర్రవల్లి చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు జోగుల రవి, వెంకటేష్, వెంకటన్న, అనిల్, వెంకటేశ్వర్లు, అంజి, పరుశరాం, కృష్ణయ్య పాల్గొన్నారు.



ఎర్రవల్లి చౌరస్తాలో..

పకడ్బందీగా ఓటరు నమోదు



అమరవాయిలో ఓటరు నమోదును పరిశీలిస్తున్న అధికారులు

మానవపాడు: మండలంలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపడుతున్నట్లు తహసీల్దార్ జుబేర్ మొహినుద్దీన్ తెలిపారు. మండల కేంద్రంతోపాటు అమరవాయిలో శనివారం ప్రత్యేక ఓటరు నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. డబుల్ ఓటు ఉంటే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ రజనీకాంత్‌రెడ్డి, కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.

గట్టు: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు పొందాలని తహసీల్దార్ ధనుంజయ్ కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాను పక్కాగా రూపొందించాలని బీఎల్ఓలకు సూచించారు.

గద్వాల అర్బన్: 18ఏళ్లు నిండిన వారిని ఓటరుగా నమోదు చేయాలని లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్ కోఆర్డినేటర్ శ్రీనాథ్ అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్‌స్టేషన్‌లో అర్హులైన వారి పేర్లను నమోదు చేయించాలని, ఇతర ప్రాంతాల్లో నివసించే వారి పేర్లు, చనిపోయిన వారి పేర్లు ఉంటే తొలగించేవిధంగా చూడాలని తెలిపారు. బూత్‌స్థాయిలో సర్వే చేయాలని, పార్టీ గెలుపునకు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు.

నాణ్యత పాటించాలి

జోగుళాంబ శక్తిపీఠం: అలంపురం జోగుళాంబ ఆలయంలో భక్తులకు ఉచితంగా పంపిణీ చేసే పులిహోర ప్రసాదంలో నాణ్యత పాటించాలని పాలకమండలి సభ్యురాలు చంద్రకళ భర్త నీలప్ప ప్రకటనలో కోరారు. ఇటీవల భక్తులకు పాచిపోయిన ప్రసాదం పెట్టడంతో పారవేశారని పేర్కొన్నారు. మరోసారి ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా చూడాలన్నారు.

నర్సరీ పరిశీలన



మానవపాడు: మండలంలోని బోరవెల్లిలో ఏర్పాటు చేసిన నర్సరీని శనివారం ఎంపీడీఓ రమణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీ నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలని సిబ్బందికి సూచించారు. క్రమం తప్పకుండా నీరందించి మొక్కలను సంరక్షించాలని తెలిపారు. అదేవిధంగా ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు.

అదనపు గదుల ప్రారంభం

గద్వాల రూరల్: జిల్లా కేంద్రంలోని బీసీ బాలికల కళాశాల వసతిగృహం అదనపు గదులను శనివారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రామన్‌గౌడ్, ఎంపీపీ విజయ్‌కుమార్, కౌన్సిలర్లు కృష్ణ, హరి, మహేష్ పాల్గొన్నారు.



అదనపు గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

బాధిత కుటుంబానికి పరామర్శ

కేటీదొడ్డి: మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఉరుకుందు తండ్రి సవారప్ప అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అతడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా సవారప్ప పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ జంబు రామన్‌గౌడు, జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్‌ఎంపీపీ రామకృష్ణనాయుడు, చక్రధర్, గోపి ఉన్నారు.

విద్యార్థులకు సన్మానం



గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని పాత హౌసింగ్‌బోర్డుకు చెందిన దినేష్, మహేష్ ఎంబీబీఎస్ పూర్తి చేసి పీజీ మెడికల్ సీట్లు సాధించారు. వీరిని శనివారం టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి కురువ విజయ్‌కుమార్ శాలువాతో సన్మానించి అభినందించారు. వైద్యవిద్యలో రాణించి పేదలకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

ప్రతి ఇంటి నుంచి మట్టి సేకరణ



టీటీదొడ్డిలో మట్టి సేకరిస్తున్న బీజేపీ నాయకులు

శాంతినగర్: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఢిల్లీలో అమృత్ వనం నిర్మాణానికి ప్రతి ఇంటి నుంచి మట్టి సేకరిస్తున్నట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జలగరి అశోక్ తెలిపారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్య్ర సమరయోధులు, అమర జవాన్లు, పోలీస్ అమరవీరుల స్మారకార్థం ఢిల్లీలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ స్థూపం నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రధాని మోదీ పిలుపుమేరకు ప్రతి ఇంటి నుంచి మట్టి సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బంగి లక్ష్మణ్, రవి, తిరుమల్‌రెడ్డి, మధుసూదన్‌గౌడ్, చిన్నమల్లయ్య, రామకృష్ణ, జగన్మోహన్‌రెడ్డి, నాగ మద్దిలేటి, వెంకటేశ్వర్లు ఉన్నారు.

అయిజ: మండలంలోని తొత్తినోనిదొడ్డిలో బీజేపీ నాయకులు మట్టి సేకరణ కార్యక్రమం చేపట్టారు. ముందుగా ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గోపాలకృష్ణ, ఆంజనేయులు, తిరుమల్లేష్, నర్సన్‌గౌడ్, శేఖర్, రాజేష్ పాల్గొన్నారు.

రాజోళి: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఈనెల 15వ తేదీ వరకు ప్రతి ఇంటి నుంచి మట్టి సేకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో పార్టీ నాయకులతో సమావేశమై మాట్లాడారు. అశోక్, స్వప్న, రాజగోపాల్, బంగి లక్ష్మణ్, ఆంజనేయులు, రంజిత్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

మానవపాడు: మండల కేంద్రంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ తిరుమల్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి మట్టి సేకరించాలని కోరారు. చిన్నమల్లయ్య, శివకుమార్, ఉపేంద్ర, ఈశ్వర్, గడ్డం మద్దిలేటి, నాగరాజు, రాఘవయ్య, మద్దిలేటి, జగన్మోహన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఏపీపీగా యుగంధర్



గట్టు: మండల కేంద్రానికి చెందిన యుగంధర్ జిల్లా కోర్టు సీనియర్ సివిల్ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం కోఆప్షన్ సభ్యుడు సత్యనారాయణ, సీనియర్ సిటిజన్స్ గోవిందప్ప, శ్రీనాథ్, నర్సింహులు, లింగయ్య, తిమ్మప్ప, నాగరాజు, కిష్టప్ప, వార్డు సభ్యులు సన్మానించి అభినందనలు తెలిపారు.

ఆకట్టుకున్న మాక్ పోలింగ్



ఎర్రవల్లిచౌరస్తా: స్థానిక సరస్వతి పాఠశాలలో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఎన్నికల అధికారులుగా వ్యవహరించగా, మిగతా విద్యార్థులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టండి

ధరూరు: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి పిలుపునిచ్చారు. అధిక ధరలు, నిరుద్యోగం, ఉపాధి కుదింపు వంటి ప్రజావ్యతిరేక విధానాలపై ఈనెల 7వ తేదీ వరకు చేపట్టిన నిరసన కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్లను శనివారం మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర ధరల నియంత్రణను కేంద్ర ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక యువత అవస్థలు పడుతున్నారన్నారు. ఒకవైపు ప్రజలపై భారం మోపుతూ.. పెట్టుబడిదారులకు రూ.లక్షల కోట్ల రాయితీలు ఇస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు నర్సింహులు, దేవదాసు, అనిల్, మోష, తిమ్మప్ప, గోవిందు, ఆంజనేయులు, అంజి, ప్రవీణ్, రాజు పాల్గొన్నారు.



ధరూరులో కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

రాజోళి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను వీడాలని సీపీఎం మండల కార్యదర్శి విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని తూర్పు గార్లపాడులో కేంద్ర ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దేవదాసు, మద్దిలేటి, మోహన్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

ఎర్రవల్లిచౌరస్తా: మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్ఐ కృష్ణదేవ శనివారం తెలిపారు. శుక్రవారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగిరాలేదని, కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలించినా ఫలితం లేకపోయిందని పేర్కొన్నారు. యువతి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



కేటీదొడ్డిలో లక్ష్మీవేంకటేశ్వరస్వామికి పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు



అయిజలో..

మల్దకల్: శ్రావణ శనివారం సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి, సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివ, సీతారామస్వామి, చర్లగార్లపాడు వేంకటేశ్వరస్వామి ఆలయాలను తెల్లవారుజాము నుంచే భక్తులు సందర్శించి పూజలు చేశారు. ఆదిశిలా క్షేత్రంలో పలువురు దాసంగాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు రమేషాచారి, మధుసూదనాచారి, రవిచారి స్వామివారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆదిశిలా క్షేత్రం, కృష్ణస్వామి ఆలయాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, మధుసూదన్‌రెడ్డి, సీతారామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, బాబూరావు, ఉరుకుందు, శ్రీను, రంగస్వామి, శివమ్మ, కృష్ణ పాల్గొన్నారు.

కేటీదొడ్డి: శ్రీపాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉపవాస దీక్ష చేపట్టిన భక్తులు.. కృష్ణానదికి ఊరేగింపుగా వెళ్లి నదీజలాలను తీసుకొచ్చారు. అనంతరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా వర్షాల కోసం ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ ఆంజనేయులు, గోపి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అయిజ: పట్టణ సమీపంలోని కట్టకింది తిమ్మప్పస్వామి రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి మంగళ వాయిద్యాల మధ్య రథంపై ఊరేగించారు. మహిళలు మంగళహారతులు పట్టారు. యువత నందికోళ్ల సేవలో పాల్గొన్నారు. చిన్నారుల కోలాటం అందరినీ ఆకట్టుకుంది. అదేవిధంగా ఈడుగోనిపల్లి శివరామకృష్ణ, ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. దేవతామూర్తులను తుంగభద్ర నదీజలాలతో అభిషేకించి, పల్లకీసేవ నిర్వహించారు.

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి క్షేత్రంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి పంచామృత అభిషేకం, అర్చనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

అబ్రహం అభ్యర్థిత్వంపై పునరాలోచించాలి



అలంపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

అలంపూర్: ఎమ్మెల్యే అబ్రహం అభ్యర్థిత్వంపై బీఆర్‌ఎస్ అధిష్టానం పునరాలోచించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. అలంపూర్ మండలం, మున్సిపాలిటీలోని అసమ్మతివర్గ నాయకులు శనివారం ఎమ్మెల్యే అబ్రహం అభ్యర్థిత్వానికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్లు మోహన్‌రెడ్డి, రాఘవరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ శేఖర్‌రెడ్డి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ సుదర్శన్‌గౌడ్, డాక్టర్ రాజన్న, వెంకట్రామయ్యశెట్టి, కౌన్సిలర్లు సుష్మారావు, ఇంతియాజ్ అలీ మాట్లాడారు. సిట్టింగ్ ఎమ్మెల్యేతో పార్టీకి తీరని నష్టం చేకూరుతోందన్నారు. ఎమ్మెల్యేపై ప్రజల్లో సదాభిప్రాయం లేదన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి కనీస గుర్తింపు ఇవ్వలేదన్నారు. నియోజకవర్గ కేంద్రాన్ని పూర్తిగా విస్మరించారన్నారు. ఐదో శక్తిపీఠం జోగుళాంబ క్షేత్రానికి కనీసం రవాణా సౌకర్యాన్ని మెరుగుపర్చలేదని తెలిపారు. అలంపూర్‌కు వచ్చిన డిగ్రీ కళాశాలను దూరం చేశారన్నారు. వంద పడకల ఆస్పత్రిని అలంపూర్ చౌరస్తాకు తరలించి, ఉన్న 50 పడకల ఆస్పత్రిని 20కి కుదించేవిధంగా చూశారని ఆరోపించారు. 10ఏళ్ల కిందట అలంపూర్–ర్యాలంపాడు మధ్య చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి కాలేదన్నారు. కేవలం కమీషన్లు రావనే కారణంతోనే పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఒక గ్రూప్‌ను తయారు చేసుకొని అక్రమ దందాలకు తెరలేపారన్నారు. అలంపూర్ కేజీబీవీకి రూ.20లక్షలు మంజూరైతే, ఆ నిధులతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వినియోగించినట్లు తెలిపారు. సంక్షేమ పథకాల అమలులోనూ స్వార్థ రాజకీయాలు చేస్తున్నారన్నారు. అలాంటి వ్యక్తిని అభ్యర్థిగా ప్రకటిస్తే ఏం ముఖం పెట్టుకొని ఓట్ల కోసం వెళ్తామని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ పునరాలోచన చేయాలని కోరారు. కార్యక్రమంలో బుక్కాపురం శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ఈవీఆర్ శెట్టి, మద్దిలేటి, అయ్యస్వామి, కాంతారెడ్డి, విక్రంసేనారెడ్డి, రుక్మొద్దీన్, రవికుమార్, సదానందమూర్తి, దివాకర్‌గౌడ్, పెద్దారెడ్డి పాల్గొన్నారు.

వాల్మీకులకు ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలి

గద్వాల రూరల్: గద్వాల నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ ఈసారి వాల్మీకులకు కేటాయించాలని ఆ సంఘం నాయకులు కోరారు. జిల్లా కేంద్రంలోని వాల్మీకి భవనంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. వాల్మీకులకు పార్టీ టికెట్ కేటాయించాలని ఆదివారం ఛలో గాంధీభవన్ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి వాల్మీకులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మధుసూదన్‌బాబు, వీరబాబు, హన్మంతు, రాములు, కోటేష్, రాము, రాములు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వాల్మీకి సంఘం నాయకులు

104 ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

గద్వాల అర్బన్: 104 ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ అధ్యక్షుడు బీచుపల్లి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 104 ఉద్యోగులు 15ఏళ్లుగా ఎలాంటి ఉద్యోగ భద్రత లేకుండా పని చేస్తున్నారన్నారు. వీరికి అన్ని అర్హతలు ఉన్నప్పటికీ ప్రభుత్వం రెగ్యులర్ చేయడం లేదని, జీవోనంబర్ 60 ప్రకారం ఉద్యోగులకు స్లాబ్‌ల పద్ధతిన వేతనాలు చెల్లించడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఏజెన్సీ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 104 ఉద్యోగులకు ఇచ్చిన ఆప్షన్ ప్రకారం సొంత జిల్లాలకు బదిలీ చేయాలని, హెల్త్‌కార్డులు లేదా బీమా సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. చందు, శ్రీహరి, శివకుమార్, బాలరాజు, అతిక్ అహ్మద్, నారాయణ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న 104 ఉద్యోగులు

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..

నేషనల్ హెల్త్ స్కీంలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పరుశరాముడు, శివ, నాగార్జున, ప్రమోద్, హరిప్రసాద్, గోపాల్ పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

అలంపూర్ రూరల్: ఆర్డీఎస్ చివరి ఆయకట్టు వరకు సాగునీరందిస్తామని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని బీజేపీ సీనియర్ నాయకుడు చిన్నమల్లయ్య అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్డీఎస్ వద్ద కుర్చీ వేసుకొని చివరి ఆయకట్టు వరకు నీటిని అందిస్తానని ఇచ్చిన మాట ఏమైందని ప్రశ్నించారు. అలంపూర్ నియోజకవర్గం చుట్టూ జీవనదులు ఉన్నా రైతులకు లాభం లేకుండాపోయిందన్నారు. వానాకాలంలో సాగు చేసిన మొక్కజొన్న, పత్తి, మిరప తదితర పంటలు ఎండుతున్నాయని, రైతులను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో మధుసూదన్‌గౌడ్, నాగ మద్దిలేటి, జగన్మోహన్‌రెడ్డి, ఈశ్వర్, వినీత్‌కుమార్, జగన్‌గౌడ్, ప్రదీప్ ఉన్నారు.

నేతన్నలకు అండగా ప్రభుత్వం

అమరచింత: చేనేత కార్మికులకు అన్ని విధాలుగా ఆదుకున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కిందని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, మార్కెట్ చైర్మన్ ఎస్‌ఏ రాజు అన్నారు. శనివారం పట్టణంలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి చిత్రపటానికి చేనేత కార్మికులతో కలిసి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మగ్గం ఉన్న ప్రతి కార్మికుడికి నెలకు రూ.3 వేలు అందించడం సంతోషకరమన్నారు. రాజేందర్‌సింగ్, రమేష్ ముదిరాజ్, నరసింహులుగౌడ్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న చేనేత కార్మికులు